

# విరామం

## – అంగర వేంకట కృష్ణారావు



1939 నుంచి 45 వరకూ జరిగిన రెండో ప్రపంచ మహాయుద్ధం మానవ జాతి మనుగడలో ఒక బృహత్తర ఘట్టం. ఈ సమరంలో రాజ్యాలు చూస్తూండగా పేక మేడల్లా కూలిపోయేయి. మహానగరాలు తిరగట్లో పప్పులా పిండైపోయేయి. మనుషులు కుంపట్లో పడ్డ చీమల్లా మాడిపోయేరు. ఆ విధ్వంసకాండ అభూతం! వర్ణనాతీతం.

పోతే, యిక మరి యుద్ధం వద్దనిపించిందా? మరి హింస వద్దు అనిపించిందా? ఉహుఁ యుద్ధమన్నా, హింసన్నా, జంకుపోయిందేమో...యుద్ధమే యెల్లప్పుడూ సాగేది. శాంతి ఒక "విరామం" లాంటిది.

ఆంధ్రజ్యోతి సచిత్రవార పత్రికలో ధారావాహికంగా వెలువడ్డ ఈ నవల్లో అడుగడుగునా "నేను" వున్నా ఇది కేవలం నా వూహ కాదు. ఈ ప్రదేశాలు నా కళ్ళతో చూసినవి. అయితే, రచనకి కల్పన అవసరం. ఇందులో కల్పన 'అంత మాత్రమే' వుంది.

అంగర వెంకట కృష్ణారావు

ఒక చిన్న మాట!

ఇటీవల తెలుగులో వస్తున్న నవలలన్నీ అపౌరుషేయాలు. భబానీ భట్టాచార్య బెంగాల్ క్షామం గురించి వ్రాసిన 'సోమెనీ హంగర్స్' తో తులతూగ గల మొట్టమొదటియుద్ధ దుష్ఫలితాల నభివ్యక్తం చేసే నవల తెలుగులో 'విరామం' అంటే ఎవరూ ఆశ్చర్యపోనక్కరలేదు. సాంస్కృతిక జీవనం పూర్తిగా స్తంభించిపోయి, అన్ని కళలూ, శాస్త్రాలూ, సర్వమూ సినిమాకు, రాజకీయాలకూ దాస్యం చేస్తున్న ఈ రోజులలో, శక్తిమంతమైన రచనలు రావటానికి ఉన్న అవకాశాలు దాదాపు మృగ్యం. సాహిత్యంలో వచ్చే కొత్త పోకడలను పసికట్టి, ఆదరించి ప్రోత్సహించే స్థితిలో పత్రికలు, ప్రచురణకర్తలు లేకపోయినట్లయితే, ఇక ఆ దేశపు దౌర్భాగ్యం గురించి చెప్పనవసరం లేదు. మనుష్యులలో ఏ ఒక జాతిపట్లనైనా ద్వేషం ప్రకటించడం యావత్తు మానవజాతినీ ద్వేషించడం కాగలదనే జ్ఞానం కూడా లేని రచయితలున్న మన దేశంలో, సాహిత్యం కాలక్షేపానికి తప్ప మరెందుకూ పనికి రాదేమో...ఈ పై సందేహాలన్నిటికీ నివృత్తి 'విరామం' నవల. అందుచేత తెలుగు నవలా సాహిత్యంలో శ్రీ అంగర వెంకట కృష్ణారావుగారి 'విరామం' ఒక కొత్త మలుపు. బెంగాలీలో భబానీ భట్టాచార్య, బిభూతి భూషణ బందోపాధ్యాయ, మానిక్ బందోపాధ్యాయ, మలయాళంలో తక్కాళి శివశంకర పిళ్లై, తమిళంలో ఆర్.కె.నారాయణ్, కానా శివసుబ్రహ్మణ్యం వంటి రచయితల కోవలోకి చేరుతారుతెలుగులో చాసో, కె.కె., రా.వి. శాస్త్రి, అంగర వెంకట కృష్ణారావు, కాళీపట్నం రామారావులు.ఇతివృత్తం, భాష, శైలి శిల్పం, పాత్ర పోషణతో సహా అన్నింట్లోనూ 'విరామం' భారతీయ భాషలలో వచ్చే ఏ ఉత్తమ నవలకు తీసిపోదని నవినయంగా మనవి చేసుకుంటున్నాను.

పురాణం సుబ్రహ్మణ్యశర్మ

విజయవాడ, 24-1-1970

*(గత సంచిక తరువాయి)*

## 17

**రాత్రి డ్యూటీ** నర్సు షీలా పాడుతూ వార్డు ప్రవేశించింది. ఆంగ్లో ఇండియనైనా హిందీ పాటలు పాడుతుంది. “పపీహారే... పపీహారే... మెరెపియాసె కహియో జాయ్... హౌ ఆర్ యూ మైడియర్ సీతారాయ్.... ఓకే? మైహుఁకితనీ ఫాస్ పియాకే... ఒహ్ ! లవ్లీ... కేసర్ సింగ్... పుస్తకం చదువుతున్నావే... సంతోషం... సంతోషం... ఫిర్భి కితనీ దూర్... మైగాడ్! ఆర్డర్లీ ఆర్డర్లీ.. ఎక్కడున్నావు... రా..... ఏమిటిదంతా వేరుశనక్కాయ తొక్కలు, బఠాణి పొట్టు.”

“ఏటమ్మా గోల!"

“గోలా... మైగాడ్... ఇదంతా యేమిటీ...”

“తొక్కు ...”

“స్వీపర్ని పిల్చి తీయించాలనీ తెలీదు... వెంటనే తుడిపించు. మేజరు సాబ్ వస్తారు... మిల్ నేసే మజదూర్... పపీహారే... హల్లో మైడియర్ రావ్! ఎలావుంది? కులాసా...?” వచ్చి స్టూలు మీద కూచుంది.

“సాయంత్రం ఏం తిన్నావు?” ప్రశ్న వేస్తూ సిగరెట్లు తీసుకుని ముట్టించింది.

“మామూలే... చపాతీ కరీ...”

"బ్రెడ్ ముక్కలు కోసి వెన్నరాసి యిచ్చేదా?"

“ఒద్దు...”

"వేడి పాలు...”

“ఇప్పుడేం ఒద్దు ప్లీజ్...”

“చూడు డియర్... ఉన్నపాళంగా యివ్వడానికి నాదగ్గిర పాల్లేవు. నిద్రపోయేముందు...”

కొంటెగా నవ్వింది. నేనూ నవ్వా.

నేనా ఆస్పత్రిలో వున్నన్నాళ్ళూ రాత్రి డ్యూటీ షీలాదే. ఆమె తన విధి భక్తి శ్రద్ధలతో, ఉత్సహం ఓపికతో చేసేది. రాత్రి తియ్యవలసిన వాళ్ళకి టెంపరేచరు తీసి, ఇవ్వవలసిన వాళ్ళకి మందులు మాకులు యిచ్చి, పాలిచ్చి, గుడ్ నైట్ చెప్పేది.

ప్రతి రాత్రి పదకొండు దాటాకా ఆమెకోసం యెవరో వచ్చేవారు. సాధారణంగా తెల్లవాళ్ళే వచ్చేవారు.

రాత్రి రెండైంది. నిద్ర రావడం లేదు. షీలా సన్నగా కూనిరాగం తీస్తూ వెళ్ళిపోతూంది.

“సిస్టర్, ఇందాకా నీకోసం యెవరో వచ్చినట్టున్నారు....”

“ఒహ్! నువ్వింకా నిద్రపోవా? ఔను. ఫ్రెండ్...”

“నీకు బాయ్ ఫ్రెండ్స్ డజన్ల కొద్దీ వున్నట్టుంది.”

"ఛిఛ్ఛీ! అసహ్యంగా మాట్లాడకు." ఆమె మొహం ఎఱ్రబడింది.

"కోపం వచ్చిందా? హాస్యానికన్నా..."

"కోపం దేనికి! నువ్వు బాయ్ వి కావా? నాకు ఫ్రండువి కావా?"

నా గుండె అదిరింది. ఎప్పుడో నేనే అన్నా ఆ మాట – ఎప్పుడు? ఔను... లాంచిలో... పద్మతో... పద్మ... ఎక్కడుంది? ఎలావుంది?

నా ఆలోచనలు పరుగెడుతున్నాయి. షీలా వేపు చూస్తున్నానన్న మాటేగాని నా ధ్యాస మరో వేపుంది. షీలా నన్ను సరిగా అర్థం చేసుకోలేక పోయింది. పైగా అపార్థం చేసుకుంది.

"ముద్దు పెట్టుకోవాల్నుందా?" మొహం మీద మొహం పెట్టి అడిగింది.

ఘట్టి ప్రశ్న. ఔనంటే తప్పేమో! కాదంటే పిరికితనమేమో. నేనామె మొహంలోకి చూస్తూ అలాగే వుండిపోయా.

ఆమె నా కింది పెదిమని నిమ్మళంగా ముద్దు పెట్టుకుంది.

"నిద్రపో..." బుజ్జగించినట్టంది.

నేను కళ్ళు మూసుకొన్నా.

"ఒక సిగరెట్లు తీసుకొంటున్నా..."

నేనేమీ అనలేదు. ఆమె నోటివైను పరిమళపు మత్తు తలకెక్కుతూంది.

"నీకోటి కావాలా?"

కళ్ళు మూసుకొనే వొద్దని తల వూపా.

ఆమె అలా తిరిగొచ్చేసరికి నేను పక్క మీద కూచున్నా. టైము రెండున్నర అయింది. వార్డు గాఢ నిద్రలో మునిగిపోయింది. శరీర బాధలేని వాళ్ళు సహజ నిద్రలో, బాధవున్నవాళ్ళు మత్తు మందు కౌగిట్లో మైమరిచేరు!

"నువ్వింకా యేమిటలా చూస్తున్నావు? నాగురించేనా? ఔను. నేను విచ్చలవిడిగా వుంటున్నా. స్మోక్ చేస్తా. తాగుతా. అన్నీ చేస్తా. తప్పనిసరి",

"కాని నేను నీ గురించి ఆలోచించడం లేదు సిస్టర్...",

"కాని నే చెప్తున్నా విను. నాకు సిగ్గులేదు. నేను హాయిగా వుండాలి. కాని అంతటితో సరిపోదు. జబల్ పూర్ లో నాకు ముసలి తల్లిదండ్రులున్నారు. తల్లి పక్షవాతపు రోగి. నాకొక అక్క వుంది. పిచ్చిది. తమ్ముడు అక్కడే ఆర్డినెన్సు ఫ్యాక్టరీలో పన్జేస్తున్నాడు. మేం బీదవాళ్ళం. నేను ప్రతినెలా యింటికి మూడువందలు పంపాలి. తప్పదు. అంచేత నాకు చాలా మంది స్నేహితులవసరం."

ఆమె కళ్ళంట నీళ్లొచ్చేయి.

"సిస్టర్..." నా గొంతు పెగల్లేదు.

"ఔను. నేను పూర్తిగా చెడిపోయాను. కాని అది నా తప్పుకాదు. ఒక పెద్ద కుటుంబం బాధ్యత యీ చిన్న వయసులో నా మీద పడింది. నేను సెలవల్లో వెళ్ళినప్పుడు ఇంటిదగ్గిర వారం కన్న ఎక్కువ వుండను. కలకత్తాలోనో, నైనిటాల్ లోనో, డార్జిలింగులోనో వుంటా. అక్కడ పది రోజులుంటే సునాయాసంగా రెండు వేలు సంపాయిస్తా. నేను సిగ్గూ శరం లేనిదాన్ననుకుంటున్నావు కదూ. నిజం అంతే. నాకు ఆర్మీయిచ్చే జీతం చాల్దు. నాతప్పుకాదు..."

నేను లేవబోయా.

"లేవకు. నువ్వింకా నిల్చోకూడదు..."

నేను మంచం మీద వాలిపోయా.

"సిస్టర్! నాకు నిద్రపట్టడానికి మాత్ర యిస్తావా?"

"నాకు నిద్ర వస్తూంది."

"సిస్టర్! నేను నీకేమైనా సాయం చెయ్యగలనా... చెయ్యగలనా... చెయ్యగలనా...నా...."'

మరొకవారం గడిచింది. అంటే నాకాపరేషన్నై మూడోవారం ప్రవేశించింది. లేచి వార్డులో కొంచెం తిరుగుతున్నా. షీలా నన్ను "డార్లింగ్" అని పిలుస్తూంది. నా పెన్నుతో టెంపరేచరూ మొదలైన వార్డు రికార్డు రాస్తూంది. అది బాగా రాస్తూందనంది. ఆమెకది బహుమతి చేశాను. అది నా జ్ఞాపకార్థం అపురూపంగా దాచుకుంటానంది. నా సిగరెట్లు అడ్డు లేకుండా కాలుస్తూంది. నా దగ్గర యాభై రూపాయలప్పు తీసుకుంది. అవి తిరిగి యివ్వక్కర్లేదన్నా. అలా వీల్లేదంది కానియివ్వలేదు. నాతో అసలు సెక్స్ కాని "చిన్నరకం సెక్స్ కలాపాలు" చెయ్యడానికి ప్రయత్నిస్తుంది. నేను చిక్కులో పడుతూండే వాడిని.

మా A–2 గదిలో సాంవరియా మరణం తరవాత అతని బెడ్డుమీదొక ఆపరేషను కేసొచ్చింది. ఆ రోగి పేరు "టాండన్". అతని రెండు అరికాళ్ళూ పూర్తిగా కాలి బొబ్బలెత్తి పోయాయి! బాంబు సింటరు గుచ్చుకుని కుడి కన్ను పోయింది. ఒకడికి శరీరంలో పది పన్నెండు ఎముకలు విరిగేయి. ఇంకొకడి కుడికాలు తొడవరకూ తీసేశారు. ఇద్దరికి పొట్టలో గుండెల్లో గుళ్ళు దూరితే ఆపరేషను చేసి అవి తీశారు. ఇంకొకడికి తుంటె ఎముక విరిగింది.

టాండన్ కి కోర మీసాలున్నాయి. అరికాళ్ళు కింద మోపలేకపోయినా, ఒక కన్ను పోయినా, నర్సులొచ్చినప్పుడు బెడ్డుమీద కూచుని చిరునవ్వుతో మీసాలు దువ్వుతూ ఒంటికంటితో వాళ్ళని తాగే సేవాడు.

ఈ వారం మధ్య "బాబూ" వచ్చాడు. అతనొక్కొక్క బెడ్డు దగ్గరికి వెళ్ళి, స్టూలు మీద కూచుని, రోగినడిగి ఏవో రికార్డులు రాసుకుంటున్నాడు. అతను సివిలియన్ "బాబూ."

నా దగ్గరకొచ్చి స్టూలు మీద కూచుని కొత్త ఫారంతీసి తల వంచుకుని ప్రశ్నలేస్తూ రాసుకుంటున్నాడు. అతనికి బెత్తెడు గడ్డం వుంది. కొసలు సూదితేరిన మీసాలున్నాయి, బొచ్చుటోపీ వుంది. అతను నా మొహంలోకి సూటిగా చూడడం లేదు. జంకుతున్నాడు. చెయ్యి వొణుకుతూంది.

అతన్నెక్కడో చూసినట్టుందనిపించింది. ఎక్కడ చెప్మా!

“మీ పేరడగొచ్చా...” అన్నాను.

అతను దించిన తల యెత్తకుండా, ఓమాటు నావేపు దొంగ చూపు విసిరి "కరీమ్” అన్నాడు.

పొరబడ్డా. మనిషిని పోలిన మనిషుంటాడు.

“మీరు నన్నెరుగుదురా?” కరీమ్ స్టూలు నాతల దగ్గిరగా యీడ్చుకుంటూ అన్నాడు.

“క్షమించండి, నేను పొరబడ్డా.”

అతనటూ యిటూ చూసి నిమ్మళంగా అన్నాడు.

ఆ “పొరబళ్ళేదు. నన్ను మీరెరుగుదురు. మొదట పద్మానదీ మీద లాంచిలో చూశారు. తరవాత అగర్తలా రేషన్ స్టాండులో చూశారు. తిరిగి యిక్కడ చూస్తున్నారు”.

నేను అదిరిపడ్డా.

“కమల్!”

అతను తిరిగి అటూ యిటూ చూసి అన్నాడు.

“గట్టిగా పిలవకండి. నా పేరు కమల్ కాదు, రాయ్ కాదు, కరీమ్. నేను ముస్లింని."

18

నేను A-2 వార్డులో కొచ్చి మూడోవారం పూర్తి కావస్తూంది. రెండ్రోజుల్లో నన్నుక్కణ్ణించి జనరలు వార్డులోకి మార్చేస్తారు. అక్కడ రెండు మూడు వారాలున్నాక డిశ్చార్జి చేస్తారు.

నా గాయం పూర్తిగా మానిపోయింది. ఇక భోజనం మామూలుగా తీసుకోవచ్చు.

ఒకసారి ఆస్పత్రి అంతా చక్కరు కొట్టాలనిపించింది. అది వూరంత ఉంది. సుమారు రెండువేల పడకలున్నాయి.

జనరలు వార్డులు సంతల్లావున్నాయి. క్రమశిక్షణ లేదు. పరిశుభ్రత లేదు. అన్నపానాలు సత్రపు భోజనాల్లా వున్నాయి. అక్కడ రోగులు దొంగల్లా వున్నారు. ఆస్పత్రిని పట్టుకుని మెదలకండా గబ్బిలాల్లా వేళ్ళాడుతున్నారు, సిబ్బంది యమదూతల్లా ఉన్నారు.

ఆ వార్డులో మందూ మాకూ లేదు. డాక్టర్లు రారు. నర్సులెప్పుడో గాని రారు. వచ్చినప్పుడు రోగులు వాళ్ళతో మోటుసరసాలాడతారు.

ఆస్పత్రి పక్కనే ఓ బజారుంది. దాన్ని "మరీజ్ బజారు" అంటారు. అంటే రోగుల బజారని అర్థం. రోగులెప్పుడూ అక్కడే వుంటారు. అడ్డమైన గడ్డీ కొనుక్కు తింటారు. రోగాలు తిరగబెడతాయి. అదే వాళ్ళక్కావాలి. నయమైతే తిరిగి యూనిట్లకి వెళ్లిపోవాలి. కాకుంటే రెస్టు క్యాంపులకి వెళ్ళాలి. అక్కడ పని చెయ్యాలి. ఆస్పత్రిలో వుంటే పని చెయ్యక్కర్లేదు. అక్కడ ఆరేసి నెలల్నించీ వున్న రోగులున్నారు.

ప్రతి బుధవారం ఆస్పత్రి పెద్ద అధికారి కల్నల్ సాబ్ వార్డులన్నీ తనిఖీ చేస్తాడు. ఆ రోజు ఒక గంట సేపు వార్డులు క్రమపద్ధతిలో పైకి నీటుగా వుంటాయి. తనిఖీ ముగిసిన మరుక్షణంలో వార్డులు కోతుల బాగోతంలా తయారవుతాయి.

ఆ ఆస్పత్రిలో వంద మందికి పైగా భారతీయ డాక్టర్లు ఆడా మగా వున్నారు. వాళ్ళలో చాలా మందికి వైద్య విషయమైన జ్ఞానం తక్కువ. దొంగ మెడికలు స్కూళ్ళ డిప్లొమాలు సంపాయించి కమీషన్తో హోదా సంపాయించిన వాళ్ళూవున్నారు.

ఆ డాక్టర్లకి వైద్యం రాదు. అందుకే పటాలంలో చేరారు. హోదాలు చలాయిస్తూ, సిగరెట్లు కాలుస్తూ, తాగుతూ కాలక్షేపం చేస్తున్నారు. వ్యభిచరించడం ఉండనే వుంది. డాక్టర్లూ నర్సులూ స్వేచ్ఛగా వుంటారు. కొందరు ప్రత్యేకనిపుణులు మినహా, మిగిలిన డాక్టర్లు చాలా వరకు చావల్ ఖరాబీ అన్నది నిర్వివాదం.

నేను ఇరవై రెండో వార్డులో చేరా. అందులో యాభై పడకలున్నాయి. అది ఒక రైల్వే స్టేషను దగ్గిర మూడో తరగతి ప్రయాణీకులుండే స్థలంలా వుంది.

నా ఎడం పక్క "సూర్జు" అనే రోగి వున్నాడు. అతనికి పెద్ద పేగులో కురుపుంది. అది ఎప్పటికీ మానదు. అతనికి ఆపరేషనై నాలుగు నెల్లైంది. అతను కారం తినకూడదు. కాని అతని పక్క కింద యెప్పుడూ రెండు శేర్ల పచ్చిమిరపకాయలుండేవి. అతనికి ఆస్పత్రి విడిచి వెళ్ళటం యిష్టం లేదు. అతను 'బిస్తీ.' అంటే నీళ్ళుమోసేవాడు. ఆ పని అతనికిష్టం లేదు. అందుకే మిరపకాయ లొదల్డు.

నా కుడిపక్క ఒక బాబు వున్నాడు. పేరు మూర్తి. కన్నడ దేశస్థుడు. అతనికి "వారికోజ్ వేను" ఆపరేషనై ఆర్నెల్లైంది. క్రమేణా వార్డు పెద్ద అయ్యాడు. మూర్తి లేకపోతే వార్డుపని బంద్దైపోతుంది. అతనిక్కూడా స్వంత యూనిట్ కి తిరిగి వెళ్లాలని లేదు. కారణం వుంది.

అతను మంచి యౌవనంలో వున్నాడు. తెల్లగా, పొడూగ్గా వుంటాడు. ఉడిపి కృష్ణ విగ్రహం మొహం. స్త్రీలని యిట్టే ఆకర్షించే అందం చందం ఉంది. వారు రాతకోతలే గాక, కెప్టెన్ మీనా ఆఫీసు పనికూడా చేస్తాడు. ఆవిడకి మూర్తి లేకుండా ఒక్క నిముషం గడవదు. వాళ్ళిద్దరికీ వున్న సంబంధం అందరికీ తెలుసు. మూర్తిని చూసి చాలామంది లేడీ డాక్టర్లు, నర్సులు గుటకలేసేవారు. కాని కెప్టెన్ మీనా అతన్ని నీడలా వదల్దు.

నా ఎదురు బెడ్డుమీద "యాదవ్" అనే మరాఠీ రోగి వున్నాడు. అతను వంటవాడు. అతనా ఆస్పత్రిలో చేరి ఆర్నెల్లు దాటింది. ఇంత వేగం కదల్డు.

యాదవ్ కండలు తిరిగిన యువకుడు. నాటకాల్లో వేషాలేస్తాట్ట. గిరజాల జుట్టుంది, హాయి హాయి మనిపించేలా పాడతాడు. హిందీ సినిమా పాటలు తరచు పాడేవాడు. కూచుని పాడుతూ కాళ్ళూచేతులూ తమాషాగా తిప్పుతూ, చిరునవ్వుతో అభినయం చేసేవాడు. అతను మెత్తగా 'మేర బుల్ బుల్ సో రహా హై శోరుగుర్ నామచా" అని పాట విసిరితే వార్డంతా నిశ్శబ్దమైపోతుంది.

యాదవ్ ది షోలాపూరు. ఒక వకీలుగారింట్లో వంటచేసేవాడు, వంటచేస్తూ పాడేవాడు. ఆ వంటగది కిటికీలోంచి ఒక గొప్ప వర్తకుడి మేడ అవుపిస్తుంది. ఇతను గొంతెత్తగానే, ఆ వర్తకుడి కూతురు మేడ బాల్కనీ మీదకొచ్చి పాట వినేది.

"బాబూజీ! ఆ పిల్ల బియ్యే చదువుతుండేది. చక్కని చుక్క. నా పాట విని మైమరచిపోయేది."

'గేలా దరియా పార్" అని గొంతెత్తగా చదువుతున్న పుస్తకాలు పడేసి బాల్కనీ మీదకొచ్చేది.

"పాట వినడమేనా, యింకేమైనా జరిగిందా?" అన్నాను.

"తొందరపడకు బాబూ" అన్నాడు యాదవ్, కళ్ళు తిప్పుతూ చిరునవ్వుతో...

"ఆ పిల్ల పేరు హంస. మొదట్లో పాడుతూన్న నా వేపు చూసి నవ్వేది. తరువాత కను సైగలు చేసేది. చివరకొక రోజు నాతో రహస్యంగా 'ఐలవ్యూ' అంది. నాకు కలవరమెత్తి పోయింది. నేనొద్దని ఎంతో బతిమాలా. వింటేనా!'''

"తరువాత..."

"పద మనిద్దరం బొంబాయి పారిపోదాం అంది. ఎంత చెప్పినా విన్లేదు. చివరకో రాత్రి యిద్దరం బొంబాయి వుడాయించాం. కానీ, వాళ్ళ నాన్న మా మీదికి పోలీసుల్ని – తోలాడు. నేను హంసని బొంబాయిలో వదిలేసి సరాసరి మిలిట్రీలో చేరిపోయా..."

"మరి హంసేమైంది?"

"పర్వాలేదు. ఇంటి కెళిపోయుంటుంది. చూశావా బాబూజీ! ఐలవ్యూ నా కొంపదీసింది".

నిజమే ఆశ్చర్యం లేదు. యాదవ్ కంఠంలో స్త్రీ హృదయాన్ని రగిల్చే చిచ్చు వుంది. అతని క్కూడా ఆ ఆస్పత్రిలో రెండు మూడు లంపటాలున్నాయి.

*( కొనసాగింపు వచ్చేనెలలో)*

Post your comments